
# దేవాంగుల మణి



అసలు అలాంటి మనిషిని ఎక్కడా చూళ్ళేదు నేను.

అదేంటోగానీ ఎప్పుడూ నవ్వుతానే ఉంటది.

ఆ నవ్వు ఎంత బాగుంటదంటే..ఎండాకాలంలో మా లాకుల మధ్య మొండిమీద పడే వెన్నెలమరకల మీద నడిచినట్టు. వర్షాకాలమప్పుడు పుంతరేవు దగ్గరున్న మా సత్తిరాజుతాతగారి దూళ్ళపాకలో వెచ్చటి గడ్డిమోపుమీద కూర్చున్నట్టు. శీతాకాలం తెల్లారగట్ట నల్లమిల్లిరాజారెడ్డిగారి పొలాలు దాటి చిక్కటి మంచులో తడిచి వెళ్తున్నట్టు ఉంటుంది...చాలా బాగుంటుంది.

అలాగ ఎప్పుడూ నవ్వుతూ ఉండే దేవాంగులమణి పుట్టినూరు ముక్కామల దిగువలో ఉన్న నేదునూరు. వాళ్ల కుటుంబంలో తాత ముత్తాతల

నించీకూడా ఎవ్వరూ ఆ పని చెయ్యలేదట. పెసరపొణుకులూ, మసాలాగారెలూ, నువ్వుపప్పుజీళ్ళు, సీనా ఉండలూ, మడతకాజాలూ, గవ్వలూ, చిలకలూ, పాలకాయలూ ఇలాగ రకరకాల వంటలు జేసి సంతలో చిన్న నులకమంచం వేసుకుని ఆ మంచం మీద పెద్ద పెద్ద సీవండి పళ్ళాలు పేర్చి వాటిల్లో ఈ పప్పలన్నీ పెట్టుకు అమ్ముకుంటారు. మణి వాళ్ళ మేనమావ బళ్ళ బాలసుబ్రమణ్యమయితే అవిడిలో పాలకోవా వ్యాపారం చేసి చాలా గడించేడు.

దేవాంగులపేటలో పడిపోతున్న పాత డాబాలో ఉండే నూలు పెద్దబ్బాయిగారి సుందరాన్ని పెళ్ళి చేసుకోడంతో మావూరు కాపరానికొచ్చింది మణి.

ఓ మూడ్నెల్లయ్యేకా "ఈ కండెలూ, డబ్బాలూ చుట్టడం, మగ్గం నెయ్యడం నాకు రావండీ" అని నవ్వుతా అంది పెనిమిటితో.

"మరేం వచ్చు?" అడిగేడు సుందరం. వాళ్ళ ఊళ్ళో వాళ్ళ ఇంట్లో జనం చేసే పని గురించి చెప్పి "ఈ నేత పని కంటే లాభసాటి వ్యాపారం అది...మీ అమ్మానాన్నకి చెప్పి చూడండి. సంతల్లో చిన్న నులకమంచం వాల్సి ఆ వ్యాపారం చేద్దాం" అంది నవ్వుతా.


కాస్త ఇబ్బంది పడతానే ఇంట్లో అందరికీ చెప్పేడు సుందరం.

ముందు మతిపోయినట్టు విన్న వాళ్ళంతా మణి లాభాలు లెక్కగట్టి చెపుతుంటే "సరే మనూరి సంతలో తప్ప బయటూరు వెళితే ఒప్పుకోం మరి" అన్నారు.

* * *

మంగళవారం. మా ఊరి కొత్త సంతపేటంతా సందడిసందడిగా ఉంది.

మా చెల్లాయత్తగారి పెద్దబ్బులు పులసుచేపలమనిషితో చాలా సేపట్నుంచి మాటాడ్తున్నాడుగానీ ఓ పట్టాన తెగేలాగనపడ్డం లేదు బేరం. పాటలుపాడే అబ్రహాం ఆగాకరకాయలూ, వేటమాంసం కొనుక్కుని హడావుడిగా వెళ్ళిపోతున్నాడు. కాకివీర్రాజుగారి రెండోఅబ్బాయి పీసుమిఠాయి బండి దగ్గరాగేడు. మల్లిడి గంగమ్మగారు తట్టంచేపలగంపతో అప్పుడే



దిగింది. సంతంతా ఒకటే హడావుడి. అయితే ఆవేళ ఎక్కువ మంది జనం మణి కొత్తగా పెట్టిన పప్పులమంచం దగ్గరాగి వెళ్తన్నారు. కొందరయితే నవ్వుతా కూర్చున్న మణినీ ఆ చిన్ని మంచాన్నీ చిత్రంగా చూస్తా ఫలానావారి కొత్తకోడలు అనేసి చిత్రంగా చెప్పుకుంటున్నారు.

చిన్నంవారి అరుగుమీద మిషనుకుట్టే త్యాగరాజుగాడు ఆ మంచం దగ్గర కొచ్చి నిలబడి పళ్ళాల్లో ఏవేమున్నాయో చూస్తుంటే నవ్వుతా వాడ్ని చూసిన మణి ''అన్నీ బాగుంటాయి ఇవ్వేళ చేసినవే... రుచి మరిగితే మరి వదల్రు... మీకేం గావాలండీ?'' అంది.

''ఓ పుంజీడు పెసరపొణుకులియ్యి'' అన్నాడు త్యాగరాజు.

పొట్లం గట్టి అందిస్తా ''ఈటితో ఏం జేస్తారండీ?'' అనడిగింది మణి.

నవ్వేసిన త్యాగరాజు ''ఆడపిల్లవి ఏం చేస్తానో నీతో చెపితే ఏం బాగుంటుంది చెప్పు?'' అన్నాడు.

''పర్లేదు చెప్పండి'' అంది మణి.

''సందలడ్డాకా మా ఇంటి మట్టి అరుగుమీద కూర్చుని మందు పుచ్చుకుంటా మధ్యమధ్యలో ఈటిని నంజుకుంటాను'' అన్నాడు త్యాగరాజు.

కొంచెం చప్పుడొచ్చేలాగ నవ్విన మణి ''ఈ పొణుకుల్తో ఉల్లిపాయ వెయ్యకండా చింతపండూ టమేటా పళ్ళతో పల్చగా పులుసెట్టించి రుచి చూడండి'' అని నవ్వుతా అందించింది పొట్లం. మాటి మాటికీ మణి అలా నవ్వుతుండడం గుర్తు చేసుకుంటున్న త్యాగరాజు అదోలాగయిపోతా నడుస్తున్నాడా సంతలో. ''అంత బాగా నవ్వుతుందేంటి? అసలు... అలాంటి నవ్వుని నేనెరుగుదునేంటి? అసలు అలాగ నవ్వుతున్న ఆ పిల్లకి నాతో పనేంటి?'' అనుకుంటా ఎదురొస్తున్న కర్రి నాగేంద్ర ప్రసాదుని గుద్దేసేడు.

లాల్చీ, షరాయికి అంటుకున్న ఎర్రకంకర దుమ్ము దులుపుకుంటా త్యాగరాజుని బూతుకానాలు తిట్టుకుంటా సంతలోంచెళ్తున్న ప్రసాదుకేసికూడా నవ్వుతా చూసింది మణి.

అంతే. కరెంటుషాకు కొట్టినట్టు అయిపోయేడు ప్రసాదు.

సంత చేసుకున్న సంచుల్తో వెళ్తున్న పాస్టర్ ఏసుపాదంగారు నవ్విన మణిని చూసి కాళ్ళకి వాసం మేకులు దిగేసినట్టాగిపోయేడు.

జూనియర్‌నాజర్‌గారి బుర్రకథ దళంలో హాస్యం చెప్పే బోణగిరి ఆదియ్య రుచెలాగుంటదో చూద్దారని నాలుగు మసాళాగారె లిమ్మన్నాడు.

పొట్లం కట్టేటప్పుడు నవ్వుతా చూసింది మణి.

దాంతో ఆదియ్య మాట పడిపోయి మతోయినోళ్ళా నడుస్తూ, ఎదురొచ్చిన ఈగల బుల్లియ్యని గుద్దేసేడు.

పాత ప్రెసిడెంటు పొట్టి సుబ్బిరెడ్డిగారితో మాటాడ్తూ వెళ్తున్న కిష్ణమూర్తిగాని చూపు కొత్తగా దుకాణం పెట్టిన మణిమీద పడింది.

నవ్వింది మణి. సైకిలు మీదెళ్తున్న హోటలు గోపాలరావుగారి శ్రీనుని చూసి నవ్వేసరికి టెన్షను పెరిగి పోయి ఇక సైకిలు తొక్కలేక దాన్ని నడిపించుకుంటా వెళ్ళిపోయేడు.

చీకటి పడింది.

గోదారికాలవలోంచెళ్తున్న గూటిపడవలో ఆడమనిషి హరికెన్ లాంతరు వెలిగిస్తుంది. అన్నపూర్ణకావిడి సాధువు కాలవ గట్టు దిగి

ఊళ్ళో కొస్తున్నాడు. దూళ్ళ బుల్లియ్య ద్వారపూడిసంతలో కొన్న గిత్తల్ని పెద్ద వీధిలోంచి తోలుకెళ్తున్నాడు. పొరుగూర్నుంచి మా ఊళ్ళో కాపరానికొస్తున్న వాళ్ళెవరో మూడుబళ్ళ సామాన్లతో దిగుతున్నారు. సోమేశ్వరంలో బయల్దేరిన సారికావిళ్ళు కాలవగట్టు దిగి ఊళ్ళో కొస్తున్నాయి.

బ్రాహ్మణరెడ్డిగారింట్లో పూలరంగడు నాటకం రిహార్సల్సు జరుగుతున్నాయి. అక్కడికొచ్చిన నాగేంద్రప్రసాదూ రోజులాగ మాటాడ్డం లేదు. ఎటో ఆలోచిస్తా అరుగు మీద కూర్చున్నాడు. అంతలో వచ్చిన నాటకం డైరెక్టరు వల్లూరి ఆదినారాయణగారు ''ఏంటి ప్రసాదూ అలాగున్నావేంటి?'' అన్నారు.

''ఇందాక సంతలో ఆ దేవాంగుల మణి అదోరకంగా నవ్విందండీ... అప్పట్నుంచీ అదోలాగుంది పురపరంగా ఉంది రాత్రి జొరంగానీ వస్తదేమోనండి' అన్నాడు నాగేంద్రప్రసాదు.

ఈలోగా అక్కడికొచ్చిన గోపాలరావుగారి శీను ''నన్ను చూసి కూడా అలాగే నవ్వింది మరి'' అన్నాడు.

''నిన్ను చూసి ఎందుకు నవ్విందో గానీ నన్నుచూసి మట్టుకి అందుకే నవ్వింది'' అన్నాడు ప్రసాదు.

కోపమొచ్చిన శీను ''నీలో తన తోబుట్టువుని చూసుకుని నవ్వుంటదేమో... నాతో మట్టుకి ఆ టైపులోనే నవ్వింది'' అన్నాడు.

''నీకు టెంపరమెంటు మరీ పెరిగిపోతుందిరోయ్'' అన్నాడు ప్రసాదు.

ఇద్దరిమధ్యా మాటామాటా పెరిగింది. జుట్టూ జుట్టూ పట్టేసుకున్నారు. బట్టలు చింపేసుకున్నారు.

విడదియ్యడానికెళ్ళిన ఆదినారాయణగారు దూరంగా పడిపోయేడు ''ఆగండ్రా'' అంటా అడ్డెళ్ళిన బ్రాహ్మణరెడ్డిగారి పెద్దాపురం శిల్కుచొక్కా పిట్లుపోయింది.

ఆ రాత్రి, భోజనం చేసి దొడ్లో మడతమంచం మీద కూర్చున్న కిష్ణమూర్తిగారు ''ఇందాక ఆ దేవాంగులకోడలు ఎంత బాగా నవ్వింది'' అనుకుంటా లోపలున్న భార్యనీ పిల్లల్నీ పిల్చారు.

వచ్చిన భార్యతో ''నేను రోజూ పూజ చేసుకునే కనకదుర్గ అమ్మవారు ఇవేళ సంతలో కనిపించింది'' అన్నారు.

విస్తుపోయిన వాళ్ళమ్మాయి ''అమ్మవారు సంతలో కనిపించడమేంటి నాన్నగారూ?'' అంది.

''అవును కనిపించింది ఆ దేవాంగుల కొత్తకోడలు నవ్వుతుంటే అచ్చం అమ్మవారే మామూలు రూపంలో నవ్వుతూ దర్శనమిచ్చి ఆశీర్వదించినట్టు అనిపించింది. చల్లటి ఆకాశంలో చంద్రోదయమైనట్టు పవిత్రంగా ఉందా నవ్వు'' అని చెప్పుకుపోతుంటే భార్య పిల్లలు అలా వింటా ఉండిపోయేరు.

మణి చెప్పినట్టు పొణుకుల పులుసు కాయించిన టైలరు త్యాగరాజు పొడిఅన్నంలో ఆ పులుసుని కలుపుకున్న వెంటనే ''అమృతం లాగుంది'' అనేసుకుని మట్టిదాకలో పులుసు మొత్తం లాగించేసి చెయ్యి కడుక్కుని బయటికొచ్చి కృష్ణకాఫీ హొటేలు బల్లమీద కూర్చున్న ఉల్లిపాయల మేష్టారి అబ్బాయి పంతులు దగ్గరకెళ్ళి జరిగిందంతా పూస గుచ్చినట్టు చెప్పి ''ఎందుకు నవ్విందంటావు?'' అన్నాడు.

నవ్వుతా కళ్ళు మూసుకున్న పంతులు ''ఆ అమ్మాయి నన్ను చూసి కూడా నవ్వింది'' అన్నాడు.

''అవునా... మరయితే అలాగ నవ్వినప్పుడేవనిపించింది?'' అన్నాడు త్యాగరాజు.

''రాజమండ్రిలో ఉంటున్న మా బంధువులమ్మాయి గుర్తుకొచ్చింది. అది నాకు వరసకి చెల్లెలవుద్ది'' అన్నాడు ఉల్లిపాయల పంతులు.

''మరి నాకు ఇంకోరకంగా అనిపించిందేంటి?'' అన్నాడు త్యాగరాజు.

నవ్వుతా త్యాగరాజు కేసి చూసిన పంతులు ''ఘంటసాలోడి స్టోను వేరూ, బాలసుబ్రమణ్యం స్టోను వేరులాగ నీకు నాకనిపించేలాగ నాకు కనిపించిందా నవ్వు... అర్థమైందా?'' అన్నాడు.

నవ్వేసిన త్యాగరాజు ''అయ్యిందయ్యింది..మధ్యలో చిన్న అనుమానమొచ్చి నీ దగ్గర కొచ్చేనంతే'' అనేసి వెళ్ళిపోయేడు త్యాగరాజు.

అర్ధరాత్రయినా నిద్రపట్టక మంచం మీంచి దొర్లుతున్నాడు భావరాజు సూర్నారాయణ మేష్టారు.

ఆయన్నలా చూసిన భార్య ''ఏంటండీ నిద్ర పట్టడం లేదా?''అంది.

''లేదుగానీ... మనమ్మాయి శ్యామల చనిపోయి ఎన్నేళ్ళయ్యింది?''అనడిగారు.

''మూడేళ్ళు దాటిందిగదండీ శ్యామల ఈ వేళప్పుడు ఎందుకు గుర్తొచ్చింది?'' అనడిగిందామె.

''ఇవాళ సంతలో ఒకమ్మాయిని చూసాను'' అన్నాడు భావరాజు మేష్టారు.

''ఎవరా అమ్మాయి?'' అందామె.

ఎవరో చెప్పి... ''అచ్చం చనిపోయిన మన శ్యామల లాగే ఉంది. శ్యామలలాగే నవ్వింది''.

''అలాగా ఆళ్ళిల్లెక్కడండీ?''

''దేవాంగులపేటలో''.

''రేపోసారి వాళ్ళింటికి వెళ్ళి వద్దాం'' అంది భావరాజు మేష్టారిభార్య.

ఆ రాత్రి, పాస్టరు ఏసుపాదం ''ఇవేళ సంతలో ఒకమ్మాయి అందమైన నవ్వు చూసేను'' అన్నాడు భార్య దయానందకుమారితో.

''ప్రభువుని నమ్ముకుని ఉన్నాం ఇవేం పాడు ఆలోచనలూ?'' మందలించింది దయానంద కుమారి.

''అందమైన నవ్వు చూసేను అన్నానుగానీ, ఇంకో దురుద్దేశంతో మాటాడేనా?... తెల్లకాయితంలాంటి నవ్వు. వెన్నెలప్పుడు లంకల్లో పుచ్చపువ్వులాంటి నవ్వు అలాంటి నవ్వుని ప్రభువుముఖంలో తప్ప ఇంకెక్కడా చూళ్ళేదు నందా?'' అన్నాడు.

''ఎవరండీ అంతగొప్పగా నవ్విన మనిషి?'' అడిగింది భార్య. చెప్పేడు.

''రేపోసారి వాళ్ళింటి వేపెళ్ళొద్దాం... ఆ మనిషిని నేనూ చూసినట్టుంటుంది'' అంది.

రోగిబీడు, ఎరకలోళ్ళ ఇళ్ళకవతలున్న వాళ్ళ తాటాకింటి ముందు పాటిమట్టి గోడకి నడ్డి ఆన్చి కూర్చున్న ఆదియ్య వాళ్ళావిడ మీరమ్మ (అసలు మీరాభి) తోనూ కొడుకు వెంకటరవణతోనూ చెప్పేడు ''ఈ వేళ సంతలో ఒక ఆడపిల్ల నవ్వు చూసేను'' అని.

''చూస్తే ఇప్పుడు మాకెందుకు చెప్పడం'' అంది మీరమ్మ.

''అది అల్లాటప్పా నవ్వుకాదు గాబట్టి'' అన్నాడు.

''ఎలాంటినవ్వయితే నీకేంటి అసలెవరా పిల్ల?'' అంది మీరమ్మ.

''దేవాంగులపేటలో ఉండే నూలు పెద్దబ్బాయిగారి కోడలు. మనం సంబరాలప్పుడు అద్దెకి తెచ్చుకునే పెట్రోమాక్సులైట్ల వెలుగెందుకూ

పనికిరాదు ఆ పిల్లనవ్వు ముందు'' అన్నాడు. ''ఇంకా ఏం జూసేవ్?'' అంది వీరమ్మ.

''చాలా చెత్త మొకాల్ని చూసేను పేడ ఏరుకుని పిడకలేసుకునే కొన్ని చెక్క మొకాల్ని చూసేను'' అని నవ్వుతా తెగ ఊగిపోతుంటే ఆ కుదుపుకి ఆ పాతగోడ కూలి ఆదియ్యమీద పడ్డంతో అతని నడుం విరిగిపోయింది.

* * *

దేవాంగులవీధిలో సరిగడ్తున్నారు. నూలువీర్రాజుగారి ఇంటి వెనక నూలు పిళ్ళు ఉనుపుతున్నారు. మరాసు మందంగా తిరుగుతుంది. మందయ్యగారింటి ముందు జాతకాలు చెప్పించుకోడానికొచ్చిన జనం నిలబడి ఉన్నారు. వాళ్ళింటి ముందునించి నడుచుకుంటూ వెళ్తున్న నాగేంద్రప్రసాదు అరుగులు కడుగుతున్న మణి వేపు చూసేడు.

నవ్వింది మణి. తూలి పడబోయి సర్దుకుని వెళ్ళిపోయేడు.

కాస్సేపయ్యాకా, పళ్ళు పువ్వులూ పట్టుకుని కుటుంబ సభ్యులతో పాటు దిగిపోయేడు కిష్ణమాచారిగారు.

నవ్వుతా వాటిని అందుకుంది మణి.

ఆ నవ్వు చూసిన కృష్ణమూర్తిగారి భార్య ''మీరన్నది నిజమేనండి'' అంది.

మధ్యాన్నం.

పిచ్చి తాతారెడ్డి సైకిల్‌షాపులో అద్దికి తీసుకున్న సైకిలెక్కి తొక్కుకుంటూ దేవాంగుల వీధిలో వెళ్తున్నాడు త్యాగరాజు.

బొంబాయి దగ్గర నీళ్ళు కొడ్తున్న మణి త్యాగరాజుని చూసి నవ్వేసరికి ఉన్న మతి పోయింది.

సాయంత్రం.

చనిపోయిన వాళ్ళ శ్యామల బట్టలన్నీ తీసుకుని వచ్చిన భావరాజు మేష్టారు దంపతులు, మణికిచ్చి ''నీ నవ్వులో మా అమ్మాయి కనపడ్తుంది మాకు'' అన్నారు.

నవ్వింది మణి.

అలాగ మణి నవ్వుని ఊరి జనం రకరకాలుగా అర్థం చేసుకుంటున్నారు. అపార్థం చేసుకుంటున్నారు. ఆ నవ్వుకి బంధువులూ, బాధితులు పెరిగిపోతున్నారు.

ఆ మణికి ఇప్పుడు నవ్వాలి, ఇప్పుడు నవ్వకూడదు అని తెలీదు. ఎప్పుడూ నవ్వుతానే ఉంటుంది. శత్రువుల్తోనూ మిత్రుల్తోనూ ఆదే నవ్వు. మంచోడితోనూ బూచోడితోనూ ఆదే నవ్వు. దేవుడితోనూ దెయ్యంతోనూ అదే నవ్వు.

మణి నవ్వులో ఎలాంటిచెడుద్దేశమూ లేదు.

ఆమెది ఒక నవ్వు.

అందమైన నవ్వు.

పరమ పవిత్రమైన ఒకానొక నవ్వు అంతే.

* * *

వంశీ పసలపూడి కథలు-72